# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు తిరుమల తిరుపతిలో పర్యటించనున్నారు.**
2. **'జాబ్ ఫస్ట్' అనేది కూటమి ప్రభుత్వ విధానమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు**
3. **తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు.**
4. **రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు తిరుమల తిరుపతిలో పర్యటించనున్నారు. ఈ సాయంత్రం కుటుంబసమేతంగా తిరుమల చేరుకుంటారు. రేపు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 44 లక్షల రూపాయలను అన్నదానం కార్యక్రమానికి విరాళంగా అందజేసి, స్వయంగా యాత్రికులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు.

తిరుమలలో నూతన టెక్నాలజీతో కూడిన భాతర ఆహార భద్రతా ప్రమాణాల యాజమాన్య సంస్థకు చెందిన 20 కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

--------------------------

'జాబ్ ఫస్ట్' అనేది కూటమి ప్రభుత్వ విధానమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గడచిన 21 నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 6 లక్షల మందికిపైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతో పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో 10 వేల 60 ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మే 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ నోటిఫికేషన్లను విడతల వారీగా విడుదల చేస్తామన్నారు.

--------------------------

తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ లో ఫిలిం డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిన్న జరిగిన గద్దర్ సినీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి విజేతలకు అవార్డులు అంద చేశారు. తెలంగాణ కేంద్రంగా చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందటానికి కొరియా తరహాలో ప్రభుత్వం సినిమా రంగాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. భారతీయ సినిమా రంగం హైదరాబాద్ కేంద్రంగా పని చేయాలని ఆకాంక్షించారు. తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి ఎదిగిందని, సినిమా రంగానికి ఏ కష్టం వచ్చినా తమ ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

అమృత్ పథకంలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో 450 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు ఏడాది కాలంలో పూర్తి చేసి, నగర ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, ఒంగోలు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి పి. రాజాబాబు తెలిపారు. ఒంగోలు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఆయన నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, నగర పౌరులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు స్టేడియంలో నిర్మిస్తున్న రెండున్నర కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు స్టేడియంను అభివృద్ధి చేస్తున్నామని, క్రీడాకారులను అన్ని విధాల ప్రోత్సాహం ఇస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈరోజు శాసన సభలో 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. మండలిలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు.

---------------------------

రంజాన్ పండుగ సెలవును ప్రభుత్వం ఈనెల 21గా ఖరారు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఉత్తర్వులు నిన్న జారీ చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా తొలుత ఈ రోజు సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే, నెలవంక కనిపించని కారణంగా వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి విజ్ఞప్తి మేరకు రంజాన్ సాధారణ సెలవును రేపటికి మార్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ యదావిధిగా పనిచేస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

---------------------------

రైతులు పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. డిమాండ్ ఉండి, లాభాలు వచ్చే పంటల వైపు మళ్లాలని రైతులకు సూచించారు. సిద్దిపేట జిల్లా

నర్మెట్టలో నిర్వహించిన రైతు మహోత్సవంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పామాయిల్ దిగుమతులపై పన్ను పెంచడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఎకరానికి 51 వేల రూపాయలు సబ్సిడి లభించే ఏకైక పంట ఆయిల్ ఫామ్ అని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

నెల్లూరు నగరంలో పచ్చదనాన్ని పెంచి, గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో జరుగుతున్న కాలువల ఆధునికీకరణ పనులను ఆయన నిన్న అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో 50 వేల మొక్కలను నాటాలని లక్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే పదివేల మొక్కలను నాటామన్నారు. పచ్చదనం పెంపొందించే అంశంపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగపూర్, సౌత్ కొరియా, ఇండోర్ లలో పర్యటించి అధ్యయనం చేశామన్నారు.

---------------------------

అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని కాపాడుకునే లక్ష్యంతో ఈరోజు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాటిస్తున్నాం. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. "నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా" ఫ్రాన్సుకు చెందిన "ఎకో-సిస్ యాక్షన్" ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న సహజ జీవవైవిధ్య జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి.. అందుకోసం క్రియాశీలకంగా పనిచేసేలా ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ లక్ష్యం.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తీరం, యానాం పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి తమిళనాడు మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉన్న ద్రోణి సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈ రోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

తెలంగాణలో తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు ఈరోజు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

--------------------------------

శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాదిని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి రథోత్సవం నిన్న ఘనంగా జరిగింది. క్షేత్ర వీధుల్లో సాగిన రథోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాక, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భ్రమరాంబికా దేవికి, స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

======================